క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సూర్యాపేట : పీడీఎస్‌యూ సూర్యాపేట జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ గుండె జబ్బుతో ఇటీవల మరణించిన వీరబోయిన లింగయ్య కుటుంబానికి ఆత్మీయ ట్రస్టు నుంచి శనివారం రూ.20 వేల ఆర్థికసాయం అంజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకుడు, ప్రజా వైద్యుడు కొప్పుల రంగారెడ్డి, ఆత్మీయ ట్రస్టు ప్రతినిధులు చిన్ని, ధర్మార్జున్ భద్రయ్య, డేవిడ్ కుమార్, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, అరుణోదయ వెంకన్న పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగా వేడుకల్లో పాల్గొనాలి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు వన్ ఎర్త్ వన్ హెల్త్ స్లోగన్‌తో యోగా డే సంబరాలు నిర్వహిస్తున్నామని, ఈ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొన్నాలని సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం యోగా గురువు చాడ పాపిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని యోగా కేంద్రంలో యోగా సాధకులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితిని ఒప్పించి, అంతర్జాతీయ యోగ డే ప్రకటించి నేటికి 10 ఏళ్లు పూర్తయిందని తెలిపారు. ఆదివారం బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఉదయం ఐదు గంటల నుంచి 8 గంటల వరకు వన్ యోగ డే సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైతుభరోసా పథకానికి దరఖాస్తుల స్వీకరణ

నాగారం : కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకాంత్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మే 5వతేదీలోపు పట్టాదారు పాస్ పుస్తకం పొందిన రైతులు రైతుభరోసా పథకానికి అర్హులన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, లేదా భూ భారతిలో డిజిటల్ సంతకం ఉన్న జిరాక్స్ పత్రం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలను దరఖాస్తు ఫారంతో జత చేసి రైతువేదికల వద్ద సంబంధిత క్లస్టర్ అధికారి(ఏఈఓ)కి అందజేయాలని సూచించారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీలోపు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. గతంలో రైతు భరోసా పథకానికి డబ్బులు వచ్చిన రైతులు ఎటువంటి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.

పలువురికి నివాళులు



భాగ్యమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ జెడ్పీటీసీ వీరప్రసాద్, నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ సోదరి ఉగ్గం భాగ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో ఆమె దశదినకర్మకు శనివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్‌లు హాజరై నివాళులర్పించారు. చాకలిగూడెంలో దొనకొండ వెంకన్న కుమారుడు రేవంత్, సూర్యానాయక్‌తండాలో లూనావత్ సోమ్లిబు మృతి చెందగా వీరప్రసాద్ నివాళులర్పించారు. ఆయా కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విచారణ జరపాలి

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని వైద్యసిబ్బంది దిపై వేధింపులు, నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి తీర్మానాలు లేకుండా ప్రజాధనాన్ని లక్షల్లో స్వాహా చేస్తున్న అధికారులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

అమ్మమాట, అంగన్వాడీ బాట

అర్వపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీజ కోరారు. జాజిరెడ్డిగూడెంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి మిఠాయిలు పంచారు. ఈ నెల 17 వరకు అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు కడెం అంజమ్మ, తాడూరి భాగ్యమ్మ, సామాజిక కార్యకర్త బింగి కృష్ణమూర్తి, ఆయాలు పాల్గొన్నారు.



అమ్మమాట- అంగన్‌వాడీ బాటలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, చిన్నారులు

ఆదమరిస్తే ఆపద వచ్చినట్లే..

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పట్టణంలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ సమీపంలో గల ఈదుల వాగు బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇటీవల వచ్చిన వర్షాల కారణంగా ప్రవాహ ఉధృతికి బ్రిడ్జిపై ఉన్న రోడ్డు కోతకు గురై కుంగిపోయింది. ఈ మార్గంలో నిత్యం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, సీతారాంపురం వెళ్లేవారు, తాళ్లగడ్డ నుంచి వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులు ప్రయాణాలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రయాణించాలంతే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడలు లేవు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, సైడ్ వాల్స్ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



కుంగిపోయి ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

ఓపెన్ చేశారు.. వదిలేశారు

భానుపురి : పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్ నుంచి కొత్త బస్టాండ్ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డుపై అండర్‌పాస్ వద్ద మురుగు కాలువ ప్రమాదకరంగా ఉంది. పది రోజుల క్రితం చెత్తచెదారాన్ని తొలగించేందుకు దీనిపై ఉన్న స్లాబ్ తొలగించిన సంబంధిత సిబ్బంది తర్వాత అలాగే వదిలేసి వెళ్లారు. నిత్యం అండర్ పాస్ నుంచి వందల బైకులు, ఆటోలు రాకపోకలు సాగించే మూలపై ఉన్న ఈ కాలువతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ కాలువ దుస్థితిపై మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ఈ కాలువపై మ్యాన్ హోల్ వేయాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న కాలువ

లక్ష్మీనరసింహస్వామికి డిప్యూటీ స్పీకర్ పూజలు



శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్

మద్దిరాల : కుక్కడం గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రామచంద్ర నాయక్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్ర నాయక్‌కు గ్రామానికి చెందిన చిన్నారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలుమల్లు యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. డిప్యూటీ స్పీకర్‌గా ఎంపికైన సందర్భంగా మొదటిసారి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనకు డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం కల్పించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏఐసీసీ అధినేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వేముగంటి సుధాకర్‌రావు, ముక్కాల వాసుదేవరెడ్డి, మద్దెల భిక్షపతి, మద్దెల వెంకటనర్సు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మద్దెల రాములు, అంజయ్య, మద్దెల యాకయ్య, వల్లపు వెంకన్న, రాము, మద్దెల మధు, మద్దెల నరేష్, వినయ్, నవీన్, చంద్రయ్య, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో 2,982 ర్యాంకు



దరావత్ జన్వేష్

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని గాయంవారిగూడెం ఆవాసం బంగారు తండాకు చెందిన దరావత్ జన్వేష్ శనివారం ప్రకటించిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 2,982 ర్యాంకు సాధించాడు. ఎస్టీ కేటగిరిలో 20వ ర్యాంకు సాధించాడు. తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దరావత్ బాలాజీ, దరావత్ సుజాతల చిన్న కుమారుడైన జన్వేష్ చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. పది ఫలితాల్లో సూర్యాపేట పట్టణంలోని కాకతీయ పాఠశాలలో 9.8 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. అదే విధంగా హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్‌లో 981 మార్కులు సాధించి కాలేజీలో సెకండ్ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా మండల ప్రజలు, గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రాజీ మార్గమే రాజమార్గం

- జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గౌస్ పాషా



రాజీపడిన భార్యాభర్తలతో తుంగతుర్తి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎండీ గౌస్ పాషా

తుంగతుర్తి : రాజీమార్గమే రాజమార్గమని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎండీ గౌస్ పాషా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొని మాట్లాడారు. క్షణికావేశంలో ఒకరి మీద ఒకరు కేసులు పెట్టుకున్న కక్షిదారులు రాజీతో సమస్యలు పరిష్కరించుకున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ వల్ల ప్రజలకు ఆర్థిక భారం, సమయభారం తగ్గుతుందని అన్నారు. నాలుగేళ్ల క్రితం తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన పర్వతం శ్రీవాణి తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో తన భర్త అనంతారం గ్రామానికి చెందిన పర్వతం మధుపై వరకట్నం కేసు పెట్టిందని తెలిపారు. అయితే ఇరువురు శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో రాజీ పడినట్లు తెలిపారు. అనంతరం ఆ భార్యాభర్తలతో పూల దండలు మార్పించారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞాన సుందర్, ఉపాధ్యక్షుడు కారింగుల వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పర్వీన్, సీనియర్ న్యాయవాదులు కుమార స్వామి, తాళ్లపెల్లి సత్యనారాయణ, లోక్‌అదాలత్ సభ్యులు వజీర్, నాగరాజు, రాజారాం, తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, ఎస్ఐలు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రాధాన్యం



జాజిరెడ్డిగూడెంలో రైతు సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం అనిల్‌కుమార్

అర్వపల్లి : వ్యవసాయ రంగం అభివృద్ధికి భారతీయ స్టేట్ బ్యాంక్ అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్(ఆర్ఎం) అనిల్‌కుమార్ చెప్పారు. వ్యవసాయ అవగాహన వారోత్సవాలలో భాగంగా శనివారం జాజిరెడ్డిగూడెం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు తాము తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. పెట్టుబడి రుణ పథకాలు, వ్యవసాయ పరికరాల రుణం, వివిధ పథకాలపై వివరించారు. అనంతరం రుణాలను సకాలంలో చెల్లించిన రైతులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, కొండకింది సత్యనారాయణరెడ్డి, కుంభం నాగరాజు, పి.యాదగిరి, బి.వీరసోములును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బ్యాంక్ మేనేజర్ బదావత్ రామకృష్ణ, ఫీల్డ్ అధికారి సురేందర్, ఎఫ్ఓఎస్ టీం లీడర్ పి.నరేష్, రాజశేఖర్, సీఎస్‌పీ నర్సింహాచారి, సిబ్బంది మధు, వెంకటేష్, లింగమల్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

సూర్యాపేట అర్బన్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. శనివారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 13వ వార్డు గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉంటే దోమలు పెరుగుతాయని, దీంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అన్నారు. వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ప్రమాదకరమని, వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లి నివసించాలని తెలిపారు. తడిపొడి చెత్త, హానికర చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు అందివ్వాలని అన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలో సరఫరా చేసే నీటికి క్లోరిన్ పరీక్ష చేశారు. మురికి కాలువలలో ఆయిల్ బాల్స్ వేశారు. పేద మహిళలను గుర్తించి స్వయం సహాయక గ్రూప్ లుగా ఏర్పాటు కావడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రేణుక, మున్సిపల్ డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టీఎంసీ శ్వేత, వార్డ్ అధికారి నరేష్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, వార్డు అధికారి బానోత్ నరేష్, జవాన్ రఫీ, మహిళా సంఘం సభ్యులు, పట్టణంలోని వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల మోహన్ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

సూర్యాపేట అర్బన్ : ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగ ఉద్యమ నాయకుడు ఏనుగుల మోహన్ సేవలు మరువలేనివని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ అన్నారు. శనివారం ఏనుగుల మోహన్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన భవన్‌లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతుల సమస్యల పై మోహన్ నిరంతరం ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. అసమానతలు లేని సమాజం కోసం పోరాడిన మోహన్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి, పీఓడబ్ల్యూ నాయకురాలు రామలింగమ్మ, ప్రవీణ్, శ్రావణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

క్రీడాపాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుంగతుర్తి : తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025 – 26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తుంగతుర్తి ఎంఈఓ బోయిని లింగయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 15వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. 01-09-2016 నుంచి 30-08-2017 మధ్యలో జన్మించి 8 నుంచి 9 ఏళ్ల వయసు కలిగిన వారు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో ఉన్న క్రీడా పాఠశాలలకు మూడు అంచెలల్లో ఎంపిక విధానం ఉంటుందన్నారు. జూన్ 16 నుంచి 19 వరకు మండల స్థాయి ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు జూన్ 23 నుంచి 26 వరకు జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో జూలై 1 నుంచి 5 వరకు ఎంపిక జరుగుతుందని అన్నారు. ఒక్కో పాఠశాలలో 20 సీట్లు బాలికలకు, 20 సీట్లు బాలురకు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మహిళలకు అండగా సఖి కేంద్రం



ఉపాధి హామీ మహిళా కూలీలకు అవగాహన కల్పిస్తున్న భవాని

సూర్యాపేట : మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సూర్యాపేట సఖి కేంద్రం కేస్ వర్కర్ పి.భవాని తెలిపారు. శనివారం సూర్యాపేట మండల పరిధిలోని ఎండ్లపల్లి, రామారం, రత్నపురం, ఉపాధి హామీ కూలీలకు సఖి కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గృహహింస, వరకట్నం, పనిచేసే చోట లైంగిక వేధింపులు, ఇతరుల నుంచి సమస్యలు ఎదుర్కొనే అతివలకు, బాలికలకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవసరమైన వారికి పోలీసుల సేవలు, న్యాయపరమైన సేవలు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఏ కష్టం వచ్చినా హెల్ప్‌లైన్ నంబర్ 181కు కాల్ చేసి సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ నిర్వాహకులు, కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివేలా చట్టం చేయాలి



డైరీలను పంపిణీ చేస్తున్న వీరపాపయ్య

అర్వపల్లి : ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను ఇంటర్ వరకు ప్రభుత్వ విద్యాలయాల్లో తప్పనిసరిగా చదివించేలా ప్రభుత్వం చట్టం చేయాలని పూలే–అంబేడ్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య కోరారు. సమితి ఆధ్వర్యంలో ముద్రించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డైరీలను శనివారం అర్వపల్లిలో ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారే తప్ప ఆచరణలో పాటించడంలేదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే వారి పిల్లలను చదివించేలా చట్టాన్ని వెంటనే రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నక్కల సురేందర్, ఎస్.నర్సింహ, కృష్ణయ్య, వెంకటమ్మ, రమణ, వీరయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రచారం



అవగాహన కల్పిస్తున్న రాచకొండ ప్రభాకర్

సూర్యాపేట అర్బన్ : ప్రజలు మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వినియోగించి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. శనివారం సూర్యాపేట కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సందర్భంగా కోర్టు ఆవరణలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, విచిత్ర వేషధారణలో ప్రచారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. నో డ్రగ్స్ సేవ్ లైఫ్ అంటూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చల్లా నరేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.

16న స్పాట్ అడ్మిషన్లు

పెన్‌పహాడ్ : అనాజిపురం గ్రామంలోని పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఈ నెల 16న స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ప్రిన్సిపల్ కోడి లింగయ్య శనివారం తెలిపారు. 6వ తరగతిలో 40సీట్లు, 7వ తరగతిలో 10 సీట్లు, 8వ తరగతిలో 6సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 30సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్ష రాయని పెన్‌పహాడ్, సూర్యాపేట పరిసర ప్రాంతాల విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్: 9989636205కు సంప్రదించాలని కోరారు.

అనాథ విద్యార్థులకు తండ్రిలా..



ఐ ఫౌండేషన్ హోంలో విద్యార్థులతో రవీందర్ (ఫైల్)

అర్వపల్లి : పేద, అనాథ పిల్లలకు అండగా నిలుస్తూ వారికి తండ్రిలా మారారు జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన సుతారపు కిష్టయ్య, లక్ష్మమ్మ దంపతుల పెద్ద కుమారుడు రవీందర్. ఆయన 15 ఏళ్ల నుంచి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో ఐ ఫౌండేషన్ హోంను ఏర్పాటు చేసి అక్కడ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత చదువుల నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చే పేద, అనాథ పిల్లలను గుర్తించి వారికి ఉచిత వసతి, ఉచిత కోచింగ్ ఇప్పిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ ఆశ్రమంలో 2వేల మందికి పైగానే విద్యార్థులకు వసతి కల్పించి కోచింగ్ ఇప్పించారు. ఇందులో అనేకమంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. మరికొందరు విదేశాలకు వెళ్లారు.

15 ఏళ్ల కిందట ఏర్పాటు చేశా..



నా తండ్రి కిష్టయ్య పడిన కష్టాలను చూసి పేద, అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించి వారు ఉన్నత చదువులు చదివేలా ఐ ఫౌండేషన్ హోంను 15 ఏళ్ల కిందట ఏర్పాటు చేశాను. హైదరాబాద్‌లో ఉన్నత చదువులు చదువుకోవడానికి వచ్చే వారికి వసతి ఏర్పాటు చేసి ఉచిత కోచింగ్ ఇప్పిస్తున్నాను. వారందరు నన్ను తండ్రిలా చూస్తుండటం ఎంతో సంతోషాన్నిస్తుంది. అలాగే రక్తదాన శిబిరాలు, వివిధ సేవాకార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నాను.

– సుతారపు రవీందర్, ఐ ఫౌండేషన్ హోం వ్యవస్థాపకుడు, జాజిరెడ్డిగూడెం

క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం

అర్వపల్లి : క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక వైద్యసిబ్బందిని సంప్రదించి వైద్యం పొందాలని మండల వైద్యాధికారి డాక్టర్ బి.నగేష్‌నాయక్ కోరారు. కుంచమర్తి గ్రామంలో శనివారం క్షయ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మందికి పరీక్షలు చేశారు. ఈ ఏడాది చివరి నాటికి క్షయను నిర్మూలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ వ్యాధి నివారణ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య, ఎంఎల్‌హెచ్‌పీ వాణి, హెల్త్ అసిస్టెంట్ దుర్గమ్మ, ఆశా కార్యకర్తలు స్రవంతి, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.



అడివెంలలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

మహాధర్నాను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నూతనకల్ : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో మోదీ ప్రభుత్వం గత 17 నెలల కాలం నుంచి అత్యంత దుర్మార్గంగా ఆదివాసీ, మావోయిస్టులపై ఏకపక్ష కాల్పులకు పాల్పడుతోందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే శాంతిచర్చలు జరిపి యుద్ధ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ధర్నాకు ప్రజాస్వామికవాదులు, విద్యావంతులు, మేధావులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల ప్రధాన కార్యదర్శి ముప్పాని సుదర్శన్‌రెడ్డి, గడ్డం పాపయ్య, చెవిటి వెంకన్న, కూసు వెంకన్న, మల్లారెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రక్తదాతకు అభినందనలు

అర్వపల్లి : ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్, సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రశిక్షకుడు పాలవెల్లి రమేష్ ఇప్పటివరకు 36 సార్లు రక్తదానం చేయడంతో శనివారం అర్వపల్లిలోని ధ్యాన శిక్షణ కేంద్రంలో అభినందించారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని రమేష్‌కు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్‌లు ఎస్.గోవర్ధనగిరి, ఎంపీ రంగారావు, ప్రశిక్షకుడు పి.వెంకటయ్య, అభ్యాసకులు దడిపల్లి వెంకట్, వనం రమేష్, మనుబోతుల వీరయ్య, మేకల సత్యనారాయణ, రాగి అనిల్, ఉమారాణి, సతీష్, జనార్దన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు అందజేయాలి

అర్వపల్లి : రెవెన్యూ సదస్సులు గ్రామాల్లో పూర్తయినందున ఇంకా ఎవరైన దరఖాస్తులు చేసుకోని రైతులు ఉంటే ఈ నెల 20వరకు స్థానిక కార్యాలయంలో అందజేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు.